# వెండి కంచం

మా బామ్మ వెండికంచంలో తప్ప భోంచేయదు. ఆమె కాపురానికొస్తూ ఆ కంచం తెచ్చుకున్నదట! అప్పటినుండి ఈనాటివరకు అందులో భోజనం చేస్తేనే బామ్మకి తృప్తి!

వెండికంచంలో పచ్చడి మెతుకులు తిన్నా... పంచభక్ష్య పరమాన్నం తిన్నంత తృప్తి! తన వెండికంచాన్ని అపురూపంగా అబ్బురంగ చూచుకుంటుంది.

వెండికంచం అంటే బామ్మకి ఆరో(ప్రాణం!

కొడుకులు... మనుమలు... మనుమరాళ్ళు... ఎవరైనా సరే తన వెండికంచం వాడుకోవటానికి ససేమిరా ఇష్టపడదు.

తనకంటే తనకనేసి పిల్లలు ఎక్కడ తగులాడుకు ఛస్తారోని... అందరూ తిన్నాకే బామ్మ ఒక్కతే వంటింట్లో పీటమీద కూర్చుని వెండికంచంలో వడ్డించుకుని భోంచేస్తుంది.

ఇంట్లో అందరికళ్ళు బామ్మ వెండి కంచంమీది!

ఆ కంచానికి ఓ మాంఛి ఫ్లాష్‌బ్యాకుంది!

ఆ వంశంలో అటు ఏడు తరాలు... ఇటు ఏడు తరాలు తిరగేసి బోర్లేసి భూతద్దం పెట్టుకు వెతికినా... ఏ కుటుంబంలో వారికీ వెండికంచం ఉన్న దాఖలాలు ల్లేవు. చిన్నమెత్తు బంగారం కూడా ఆడవాళ్ళ వంటిమీద వుండేదికాదు. మెళ్ళో తాళి తప్పించి. అంతటి పేద కుటుంబాలు!

అటువంటి చోట బామ్మ ఏడేళ్ళ ప్రాయంలో పెళ్ళాడి ఎనిమిదోఏట రజస్వల కాగానే ఎంచక్కా పెళ్ళికి తండ్రి చేయించి ఇచ్చిన వంద తులాల వెండి కంచాన్ని చంకన పెట్టుకుని కాపురాని కొచ్చిందట!

ఇప్పటికే ఆనాటి ముచ్చట్లు కథలు కథలుగా అందరికీ బామ్మ చెప్తూంటుంది.

కట్టుకున్న భర్తని సైతం తనకు పుట్టింటివారు అత్యంత ప్రేమాభిమానాలతో గిఫ్ట్‌గా చేయించి ఇచ్చిన వెండి కంచంలో అన్నం తిననిచ్చేదికాదని గర్వంగా చెప్తూంటుంది.

తిన్న ఎంగిలి కంచం తోమటానికి పనిమనిషికిక్కూడా వేయటానికి మనస్కరించక బూడిద పెట్టి తానే స్వయంగా తోమి పొడిబట్టతో తుడిచి భద్రపరిచేది (ట)!

ఏనాటిదైనా మొద్దులా ఈనాటికీ అవుపించే వెండికంచం తమపరం కాకపోతుందాని ఆశతో బామ్మని తమ దగ్గర వుండమంటే తమవద్ద వుండమంటూ నలుగురు కొడుకులూ బ్రతిమాలుతుంటారు.

ఎవరివద్ద ఎన్నాళ్ళున్నా... కోడళ్ళ దిష్టి ఎక్కడ తగులుతుందోని... తోమిన కంచాన్ని తలగడ

కింద వుండే ట్రంకుపెట్టెలో రోజూ రాత్రిళ్ళు దాచి... పెట్టెకు నైన్ లివర్స్ గోద్రెజ్ తాళం వేసి మరీ నిద్రపోతుంది బామ్మ.

ఎనభైదాటినా బామ్మ ఆరోగ్యంతో లక్షణంగ వుండటం ఫ్యామిలీ మెంబర్స్ అందరినీ ఆశ్చర్యానికి లోను చేస్తూంటుంది.

మురుకులు... బఠాణీలు లాంటివి పటపట లాడిస్తూంటుంది. ఒక్కపన్ను వూడితే ఒట్టు! చూపు మందగించలేదు... వినికిడి శక్తి తగ్గలేదు.

ఏ కొడుకు దగ్గరుంటే... అక్కడ ఇంటిపని... వంటపని... తానే చేయగల శక్తివంతురాలు బామ్మ.

ఏనాడో చేయించిన ఆ వెండికంచం ఈనాటికీ మొద్దులా పడివుంది! ఈరోజుల్లో చేయించుకునేవైతే నాలుగేళ్ళు వాడేసరికి వంపులు తిరిగి పోతుంటాయ్!

బామ్మ వెండికంచానికి నడుమ రూపాయి బిళ్ళంత బంగారపు పువ్వుంది. గులకరాళ్ళంత గట్టివి కంచానికి కింద నాలుగు కోళ్ళు వున్నయ్. ఏకంగా ఇద్దరు మనుషులు ఒకేసారి ఆ వెండికంచంలో భోజనం చేయటానికి వీలైనంత విశాలంగా వుంటుంది!

ఇన్ని ప్రత్యేకతలున్న తన కంచం గురించి చెప్పినవారికి చెప్పకుండా ఇప్పటికీ కథలు కథలుగా చెప్తూంటుంది బామ్మ!

బామ్మ ఎప్పుడెప్పుడు గుటుక్కుమంటుందో... అప్పుడా వెండికంచాన్ని లటుక్కున లాగేసుకోవచ్చని కుర్ర మనుమలు కలలు కంటూంటారు.

ఏ మనుమడైనా ధైర్యంచేసి 'బామ్మా పండక్కి నేను నీ వెండి కంచంలో భోజనం చేస్తానే...' అంటే... బామ్మ కళ్లు చింతనిప్పులౌతాయ్. పూనకం వచ్చినట్టు మనిషి కోపంతో వూగిపోతుంది.

'ఒరే మనుమడా!... నాప్రాణం కావాలంటే ఇచ్చేస్తాను! అంతేగానీ నా వెండికంచాన్ని మాత్రం వాడుకుంటానని అడక్కు! మరోసారి అడిగేవంటే ఆ చంప ఈ చంప వాయిస్తాను జాగ్రత్త... ఏమనుకున్నావో?-' తిట్టిపోస్తూంది బామ్మ.

అనురాగం... ఆప్యాయత... అభిమానం... కలబోసి ఇన్నేళ్లుగా తనవెంట నుండే వెండికంచం ఒకరోజు హఠాత్తుగా కంటికి కనిపించకుండా మాయమైంది.

ఆ విషయం తెల్సుకున్న బామ్మకి జవసత్వాలుడిగినట్లన్పించింది. ఎక్కడలేని నీరసం ఆవహించింది. మూర్ఛరోగికి మల్లే సొమ్మసిల్లిపడిపోయింది.

పోయిన వెండికంచం దొరికేవరకూ ముద్ద ముట్టనంటూ భీషణ ప్రతిజ్ఞ చేసిన బామ్మ పస్తులుండనారంభించింది.

కంటికి కన్పించకుండా మాయమైపోయిన వెండికంచంమీద దిగులు పెట్టుకుంది! ఇంట్లో

వారంతా బామ్మకి నచ్చచెప్పలేకపోయారు.

'అమ్మా... పోయిన వెండికంచం తిరిగొస్తదటే... అంతగా కావాలంటే మరో వెండికంచం చేయిస్తాగా...' కొడుకు రామానుజం తల్లిని బుజ్జగించబోయాడు.

'అది నా కంచంరా! మా పుట్టింటి వారిచ్చిందిరా!... ఇన్నేళ్ళు దాన్ని అపురూపంగా చూచుకుంటున్న కంచంరా అది! కంటికి రెప్పలాగ కాపాడుకుంటూ వస్తున్నాన్రా దాన్ని... అది నాకు పంచి ఇచ్చిన ఆప్యాయతానురాగాలను చచ్చేవరకు మర్చిపోలేను. నా వెన్నంటి... నాకు తోడుగా వుంటూ వచ్చిన ఆ వెండికంచాన్ని ఎట్లారా మర్చిపోయేది...' శోకాలు పెడుతూ గుండె బాదుకుంది.

రామానుజానికి ఏం బదులివ్వాలో తోచక బుర్ర గోక్కున్నాడు.

'రోజూ ట్రంకుపెట్టెకు తాళంవేసి మెలకువ వచ్చినప్పుడల్లా చూచుకునేదాన్ని... రాత్రెందుకో తాళంపెట్టలేదు. దరిద్రప్పెద్దమ్మనన్నావహించిందో ఏమో... నిద్రముంచుకొచ్చి... తాళం వెయ్యటం మర్చిపోయినందుకు నాకు తగిన శాస్తి జరిగింది... నా ఖర్మ ఇలా కాలింది...' తనను తాను శాపనార్థాలు పెట్టుకుంటూ తెగ హైరానా పడింది.

'పోనీ... పోలీసు రిపోర్టు ఇవ్వనా?... ఎలాగైనా వాళ్ళు వెతికి పట్టుకుంటారు... నీ బెంగ తీరుతుంది. ఎస్సై మనవాడే! నాకు మంచి ఫ్రెండ్...'

'నోర్మూయ్యరా... ఇది బైటవాళ్ళ పనికాదు. ఇంట్లో వారికి పుట్టిన దుర్బుద్ధే!... ఇంట్లో ఇన్ని సామాన్లు వుండగా... ఒక్క నా వెండి కంచమే ఎట్లా మాయమైవుంటుందీ అని...' నొక్కి నొక్కి మాట్లాడి లా పాయింటు తీసింది.

అవును! అదీ నిజమే... మరైతే ఎవరు తీసినట్టు? అనుకున్న-రామానుజం... దొడ్లో బాదంచెట్టు పక్కన నూతిలో నీళ్ళు తోడుతున్న భార్యను సమీపించి 'నువ్వేమైనా తీశావుటే?-' భార్య చెవి కొరికాడు.

భార్యకే పాపం తెలీదనేసి ఒట్టుపెట్టుకోవటంతో రామానుజంలో అంతవరకూ గల వుద్రేకం తగ్గింది.

ఇహపోతే... తన ముగ్గురు కొడుకుల విషయానికి వస్తే... వారంతా గడ్డాలు మీసాలు వచ్చి... డిగ్రీలు చదివేస్తున్న వెధవలాయె?... వాళ్ళిలాంటి వెధవపన్లకు వొడిగట్టరు. కావాలంటే పాకెట్‌మనీ ఇమ్మంటూ పదో పరకో తననే అడుగుతారు... అంతేగానీ... ఇలాంటి దుర్మార్గపు పనికి వొడిగట్టరన్పించింది.

ఈ సమస్యనెలా పరిష్కరించి... తల్లి కష్టాన్ని ఏవిధంగా గట్టెక్కించటమాని తీవ్రంగా యోచించసాగేడు రామానుజం!

★★★★★

వెండికంచం కన్పించకుండా పోవటంతో దిగులు పడి మంచం పట్టింది బామ్మ.

తిండితిప్పలు మాని రాత్రింబవళ్ళు కంచం... కంచం అంటూ తల్లి పలవరిస్తూ మంచానపడి వుండటం చూచి తట్టుకోలేని రామానుజం.. ఆమెని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి డాక్టర్‌చేత చెకప్ చేయించాడు.

అన్నిరకాల టెస్టులు చేసాక... ఆమెకి ఎలాంటి రోగం లేదని... కేవలం మనోవ్యాధితో బాధపడుతోందని... ఆ వ్యాధికి ఇంతవరకు ఎవ్వరూ మందు కనుగొనలేదని చెప్పి మూడొందలు ఫీజు గుంజిన స్పెషలిస్టు... తల్లికొడుకులను పంపించేసాడు.

ఎప్పుడూ నవ్వుతూ... హుషారుగా... ఆరోగ్యంగా వుండే తల్లి దిగులుతో మంచానపడడం మూలాన ఏం చేయటానికి రామానుజానికి పాలుపోలేదు.

ఇంట్లో సందడే కరువైంది. ఇల్లంతా నిర్మానుష్యంగ... స్మశానాన్ని తలపించటం అందరికీ బాధగానే వుంది.

వద్దంటున్నా... బలవంతాన నోరు తెరిచి హార్లిక్స్... ఫ్రూట్ జ్యూసలను మాత్రమే ఆమె గొంతులో పోస్తున్నారు.

ఇలా ఎన్నాళ్ళని బామ్మని బ్రతికించటం?- వృద్ధాప్యంలో సైతం తల్లి కంచం కోసం మొండి పట్టుదల పట్టటం... భోజనం మానేసి మంచాన నిస్సహాయస్థితిలో వుండటం చూచి రామానుజానికి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

అత్తగారు ఆరోగ్యంగా తిరుగుతూంటే కోడలు సునంద వంటింటివేపుకు గానీ... ఇంటిపన్ల జోలికి గానీ పోవలసిన అవసరం వుండేది కాదు. అలాంటిది... అత్తగారు దిగులుతో మంచమెక్కటంతో ఇంటెడు చాకిరీ తానొక్కతే చేయలేక ఛస్తోంది!

ఇంట్లో కుటుంబసభ్యులతో కూడా మాట్లాడటం మానేసింది. నిద్రలో కూడా కన్పించకుండా పోయిన వెండికంచం గురించే పలవరింత.

ఇలాగే తీసుకు తీసుకుని చివరికి 'హరీ' అంటుందేమోనని భయం రామానుజంలో మొదలైంది.

అందరూ... రోజులు లెక్కించుకుంటూ వుండవలసిన దౌర్భాగ్యస్థితి ఏర్పడింది.

ముష్టి వెండికంచం... అందునా ఇక్ష్వాకుల నాటిది... ఆఫ్టాల్ పోయినంత మాత్రాన తిండీ తిప్పలూ మానేసి నీరసాన్నీ లేని అనారోగ్యాన్నీ కొని తెచ్చుకోవటం మూర్ఖంకాక మరేమిటి. తల్లినేమీ అన్లేక భార్యమీద చిందులు తొక్కేడు రామానుజం.

★★★★★

ఒకరోజు సాయంత్రం వేళ రామానుజం ఆఫీసునుంచి ఇంటికొస్తూండగా...

'సార్... అయ్యా... రామానుజం సార్... మిమ్మల్నే.. ఇలా ఓ మారురండి...' పాన్‌బ్రోకర్ ఓనరు మార్వాడీ సేఠ్ కేకేయటం చెవినపడి ఆగి వెనక్కి తిరిగి చూసాడు.

కుదువ వ్యాపారం చేసుకునే సేట్‌కి తనతో ఏం పనబ్బా?... తననెందుకు కేకేసి పిలుస్తున్నట్టు?.... అతనికి తనకు మధ్య లావాదేవీలేం లేవే... అనుకుంటూ పది అడుగులు వెనక్కు వేసాడు రామానుజం.

'తమరు... అట్టా కూర్చోండి సార్... మీతో చాలా మాట్లాడాలి...' ఆహ్వానం పలికిన సేట్ కుర్చీ చూపాడు.

తనను అలాంటి చోట ఎవరైనా చూస్తే... అవమానంగా తోచి 'నాతో మీకు పనేంటి సేటూ? త్వరగా చెప్పండి. నేను వెళ్ళాలి...' తొందర చేశాడు కూర్చోవటానికి ఇష్టపడని రామానుజం.

'తమరి రెండో అబ్బాయి నరేష్ లేడూ...?'

సేట్‌ని మాట్లాడనీయకుండానే 'ఎందుకులేడూ... లక్షణంగా వున్నాడు... అయినా వాడి ప్రస్తావనెందుకిప్పుడు?...' నొసలు చిట్లించాడు.

'కోప్పడకండి సారూ... నెల్లాళ్లక్రితం... నా దుకాణానికొచ్చి వెండికంచం ఒకటి కుదువపెట్టి అయిదొందలు అప్పు తీసుకున్నాడు. మళ్ళీ మనిషి పత్తాలేడు... వడ్డీ ఇవ్వలేదు సరికదా... అసలు ఇచ్చి వస్తువు విడిపించుకోనూలేదు...'

సేట్ మాటలకు నివ్వెరపోయాడు రామానుజం. అతని మాటలు నమ్మబుద్ధికాలేదు.

'రామ్‌రామ్...! దేవుడిమీద ప్రమాణం చేసి అప్పు తీసుకున్నాడు. మీ ముఖం చూచి ఇచ్చాను సార్... చూడండి మీవాడు కుదువపెట్టిన వెండికంచం...' బీరువాలోంచి కంచాన్ని తీసి చూపించాడు.

ఎంత అప్రతిష్ట?... ఎంత అప్రతిష్ఠ? నరేష్ ఇంతటి దారుణానికి పాల్పడ్డాడా?- ఇంట్లో వస్తువు తస్కరించి కుదువపెట్టాడా?... ఇంటా వంటా లేని చేష్టలు కొడుక్కెలా అబ్బినయ్యో పాలుపోలేదు రామానుజానికి.

వీడు చేసిన దౌర్భాగ్యపు పనికి... కన్నతల్లి దిగులుతో మంచం ఎక్కిందాయె?... వెండికంచం కన్పించటంలేదంటే... ఏమైపోయుంటుందోని అనుకున్నాంగానీ... వాడు కాజేసి కొట్లో కుదువపెట్టివుంటాడని వూహకైనా అందలేదు.

తనజేబులో నాలుగు అయిదుసార్లు డబ్బు తనతో చెప్పకుండా తీసి అవసరాలకు వాడుకున్నాడని తెలుసు. కానీ... చివరికి బొమ్మ వెండికంచం దొంగిలించి... ఇంతటి హేయమైన పనికిపాల్పడతాడా?... అన్పించింది.

ఇరవయ్యేళ్ళొచ్చినయ్! గడ్డాలు మీసాలు వచ్చిన వెధవకి ఇదేం పోయే కాలం?...

రామానుజం కడుపు భగ్గున మండినట్టయింది.

మారు మాట్లాడకుండా జేబులోంచి నెలజీతం తీసుకున్న తాలూకు డబ్బు బైటికి తీసి

సేట్‌కి కట్టవలసిన డబ్బు 'పే' చేసి రసీదు పుచ్చుకుని... విడిపించుకున్న తల్లి వెండికంచాన్ని చేతిసంచీలో దాచి వడివడిగా ఇంటివేపు దారితీసాడు.

ఇల్లు చేరుకోగానే కళ్ళబడిన దృశ్యానికి రామానుజం కడుపు చెరువైంది.

'ఏమండీ... అత్తయ్యగారు కన్నుమూసారండీ...' భార్య సునంద బావురుమంది.

నేలమీద చాప... దానిమీద మరబొమ్మలా పడివున్న తల్లిని చూచిన రామానుజంలో దుఃఖం కట్టలు తెంచుకుంది.

వెండికంచం వున్న సంచీ నేలమీద జారిపడింది.

'అమ్మా!... నీ వెండికంచం దొరికిందమ్మా... ఇదిగో నీకివ్వాలని తెచ్చాను... చూడు! ఒక్కసారి నీ వెండికంచాన్ని నీ రెండుకళ్ళతో చూడమ్మా...' బిగ్గరగా రోదిస్తూ తల్లి శవాన్ని రెండుచేతులతో కుదిపాడు.

వెండికంచాన్ని చేతితో... మూసుకున్న తల్లి కళ్ళకు చూపిస్తూ చెవివద్ద నోరుపెట్టి "ఇదిగోనమ్మా నీ వెండికంచం!... కళ్ళు తెరువ్ అమ్మా!... తెరిచి ఒక్కసారి చూడు! చూచేక తృప్తిగా కళ్ళు మూద్దువుగాని...' లబలబా మొత్తుకున్నాడు.

ఆ అరుపుకి... కేకలకు... బామ్మలో చలనం కన్పించింది. మెల్లగా మూసుకున్న కనురెప్పలు విచ్చుకున్నాయ్!

కళ్ళ ఎదురుగా వున్న తన వెండికంచాన్ని చూడగానే బామ్మలో వేయి ఏనుగుల బలం వచ్చిందో ఏమో... పడుకుని వున్నదల్లా... గభాలున లేచి కూర్చుని కొడుకు చేతిలో గల వెండికంచాన్ని రెండుచేతులతో లాక్కుని అటూ ఇటూ తిరగేసి బోర్లేసి చూస్తూ 'ఇది నాదే?... ఇది నా వెండి కంచమే!... పోయిందనుకున్నదెట్లాగో దొరికింది? ఆ దేవుడికి నామీద దయగలిగింది. అనుగ్రహించి నా కంచాన్ని నాకిప్పించి... నన్ను బతికించాడు! ఓసి పిచ్చిముండ' ఇంత ముద్దొచ్చేదానివి నన్నొదిలి నెల్లాళ్ళు ఎక్కడికి పోయావే... నీ గురించి నేనెంత దిగులుపెట్టుకున్నానో తెలుసా?...' ఆవేశపడిపోతూ వెండికంచాన్ని ముద్దాడడం చూస్తూ చుట్టూ వున్న కుటుంబసభ్యులు సంబరపడ్డారు.

అత్తగారు గట్టిపిండమే! వెండికంచం దొరికిందనగానే చచ్చిందల్లా లేచి కూర్చుంది... అనుకుంది మనసులో.

తల్లి... వెండికంచం దక్కటంతో ఆనందించాడు రామానుజం!

'నేనప్పుడే పోనర్రా... సెంచురీ కొడతాను అని బామ్మ అనటంతో ఇల్లంతా నవ్వులతో నిండింది!!

- సమాప్తం -